సాక్షి పెద్దపల్లి

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



రాజన్నకు కోడె మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు బుధవారం 20 వేల మంది భక్తులు తరలివచ్చారు. కోడె, తలనీలాలు తదితర మొక్కులు చెల్లించుకున్నారు.



సింగరేణి క్వార్టర్లు అన్యాక్రాంతం

సింగరేణిలో ఖాళీ క్వార్టర్లు పెరిగిపోతున్నాయి. సంస్థ వ్యాప్తంగా పర్మినెంట్ కార్మికులు తగ్గిపోతుండగా వారి స్థానంలో కాంట్రాక్టు కార్మికులు పెరిగిపోతున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/18.0

గాలిలో తేమశాతం తక్కువ అవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గోదావరిఖనిలో సబ్ కోర్టు ప్రారంభం



సబ్ కోర్టును ప్రారంభిస్తున్న జడ్జి రాజ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: సింగరేణి సంస్థ ఆర్జీ–1 సహకారంతో జిల్లా అదనపు న్యాయస్థానం, కార్మిక న్యాయస్థానం ఆవరణలో నూతనంగా నిర్మించిన సివిల్ జడ్జి (సబ్‌కోర్టు)ను బుధవారం సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్ ప్రారంభించారు. కక్షిదారులు, న్యాయవాదుల సౌకర్యం కోసం సబ్‌కోర్టును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, సింగరేణి అధికారులు, న్యాయవాద సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం న్యాయమూర్తిని గోదావరిఖని ప్రిన్సిపల్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, టీఎస్పీ భార్గవి, దుర్గం గణేష్, సింగరేణి ఎస్టేట్ అధికారి బాల సుబ్రహ్మణ్యంను బార్ అసోసియేషన్ సన్మానించింది. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.శైలజ, జవ్వాజి శ్రీనివాస్, సభ్యులు నుచ్చు శ్రీనివాస్, గుర్రం నారాయణ, చెల్కల పద్మజ, గుడికందుల భూమయ్య, గుర్రాల రాజేందర్, ఎండీ ఉమర్, విక్రమ్‌సింగ్,అనురాధ, శ్రీధర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..



కలెక్టర్‌తో సమావేశమైన ఎంపీ, ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి బుధవారం రాత్రి కలెక్టర్ సంగీతతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన పనులు, వాటి పురోగతిపై చర్చించారు. పేదల అభ్యున్నతికి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. పెద్దపల్లి–కూనారం మార్గంలో చేపట్టిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల్లో వేగం పెంచేలా చూడాలన్నారు. దళితబంధు పథకం కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

పోటీ పరీక్షల్లో నెగ్గి జిల్లాకు పేరు తేవాలి

నిరుద్యోగులు పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలు సాధించి జిల్లాకు పేరు తేవాలని ఎంపీ సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్‌తో కలసి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటోందని, అభ్యర్థులు అర్హతలను బట్టి ఉద్యోగాలకు పోటీ పడాలని సూచించారు.

విదేశాల్లో పనిచేయాలనుకుంటున్నారా..!

- జిల్లా ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు

పెద్దపల్లిరూరల్: గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, హంగేరీ, రొమేనియా, కెనడా, జర్మనీ, జపాన్, యూకే వంటి వివిధ దేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ రిజిస్టర్ ఏజెన్సీలతో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఒ ప్పందం కుదుర్చుకుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. ఆయా దే శాల్లో పనిచేసేందుకు ఆసక్తి, అర్హతగల నైపుణ్యం గల కార్మికులు, ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, జేసీబీ డ్రైవర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లు, వెల్డర్ల నియామకాలకు సహకారం అందిస్తామని, ఆసక్తి గలవారు టీఓఎంకామ్ వైబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ నంబరు 91007 98204, 99519 09863, 83286 02231లలో సంప్రదించాలని కోరారు.

ట్యూటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: రామగుండం వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 14 ట్యూటర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మార్చి 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వైద్యకళాశాలలో 4 అటానమీ, 2 ఫిజియాలజీ, 3 బయోకెమిస్ట్రీ, 2 ఫార్మకాలజీ, 3 ఫొరెన్సిక్ మెడిసిన్ ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

శునకం.. భయానకం..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు శ్రీహర్షిత్. రామగుండం కార్పొరేషన్‌లోని యైటింక్లయిన్ కాలనీ. నెల క్రితం ఇంటినుంచి పాఠశాలకు వెళ్తుండగా అకస్మాత్తుగా కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కలవారు వెంటనే స్పందించి కుక్కలను తరిమేయడంతో పెనుప్రమాదం తప్పింది. కుక్కల బెడద నివారించాలని బల్దియా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ పిల్లాడి తల్లిదండ్రులు వాపోతున్నారు.



రోడ్లపై వీధి కుక్కల సంచారం

- రాత్రివేళ గుంపులుగుంపులుగా..
- ప్రజలను వెంటాడుతున్న వీధి కుక్కలు
- తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు
- నియంత్రణపై పట్టింపు కరువు

ఈ అంశాలు పాటిస్తే మేలు

- ఆహార వ్యర్థాల విషయంలో శాస్త్రీయ నిర్వహణ ఉండాలి.
- హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, మాంసం విక్రయ కేంద్రాల వద్ద వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి
- పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు టీకాలు వేయించాలి.
- కుక్కకాటుకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించాలి.

జిల్లాలో కుక్కకాటుకు గురై టీకాలు తీసుకున్న వారు

2022	2,387
2023(ఇప్పటివరకు)	486

➜ గత సెప్టెంబర్‌లో రామగుండం కార్పొరేషన్ పరిధి నర్రశాలపల్లికి చెందిన పోచమ్మ, నవంబర్‌లో ఎల్బీనగర్‌కు చెందిన ధర్మేందర్ కుక్కల దాడిలో గాయపడి మృతిచెందారు. విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్తున్న వీరిపై కుక్కల గుంపు ఒక్కసారిగా దాడిచేశాయి. అదేనెలలో మరో 10 మంది కూడా కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా అంతటా కుక్కలతో ప్రమాదాల బారిన, గాయాల బా రిని పడుతున్న వారి సంఖ్య పెరుగుతు న్నా.. పాలకవర్గాలు మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. ఏ కాలనీలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగానే తిరుగుతున్నాయి. మనుషులపై దాడి చేయడమే తరువాయి అన్నట్లు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో ఒంటరిగా వెళుతున్న వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. అనుకోని రీతిలో కుక్కలు వెంటపడుతుండడంతో అప్పటికప్పుడు ఏం చేయాలో తెలియక ప్రజలు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇలా కుక్కల బెడద రామగుండం కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో అధికంగా ఉంది. వీటికి ప్రధాన కారణం చికెన్, మటన్, హోటళ్లు ఎక్కువగా ఉండటం, వాటి వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడమే అంటున్నారు స్థానికులు. ప్రతి ఆర్నెళ్లకోసారి ఇళ్లలో ఉండే పెంపుడు కుక్కలను స్థానికంగా ఉండే పశువైద్యశాలలో ఇంజక్షన్లు వేయిస్తారు. వీధి కుక్కలకు స్థానిక సంస్థలు చేయించాల్సి ఉంటుంది. ఇలా చేయిస్తే కుక్కలు కరిచినా.. మనుషుల ప్రాణాలకు పెద్దగా ముప్పు ఉండదు. ఈ విషయంలో 'మాకెందుకు తలనొప్పి..' అని వదిలేస్తున్నారు. వాటి కట్టడికి కు.ని శస్త్రచికిత్సలు చేయాలి. ఒక్కో కుక్కకు సుమారు రూ.2వేల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో మూడు నాలుగేళ్లుగా జిల్లాలో ఒక్కదానికీ శస్త్రచికిత్స చేసిన దాఖలాలు లేవు. ఫలితంగా గల్లీగల్లీకో కుక్కల గుంపు తయారైంది. దొంగలు, అనుమానితులను గుర్తించడం దేవుడెరుగు.. కాలనీవాసులపైనే దాడులకు తెగబడుతున్నాయి.

ఆదేశాలు పట్టని వైనం

రామగుండంలో కుక్కలు, కోతుల నియంత్రణకు రవీంద్ర అనే కాంట్రాక్టర్‌కు టెండర్ ఇస్తున్నట్లు గతేడాది డిసెంబర్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. ఒక్కో కుక్కకు రూ.700, కోతికి రూ.850చొప్పున పట్టణ ప్రగతి నిధులు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదించింది. ఇప్పటివరకు సదరు కాంట్రాక్టర్ ప్రక్రియ మొదలే పెట్టలేదు. అలాగే బల్దియాల్లో కుక్కల జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని హైకోర్టు 2022 జూన్ 17న ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లో ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలని కూడా గడువు ఇచ్చింది. కుక్కల నియంత్రణ శాస్త్రీయ పద్ధతిలో కొనసాగాలని పేర్కొంది. అయినా ఇప్పటివరకు అధికారులు ఎక్కడా చర్యలు తీసుకోలేదు.

నియంత్రణ అంటే వణుకు..

కుక్కల నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలదే. అయినప్పటికీ సిబ్బంది కొరత, నిధుల లేమి, ఇతరత్రా కారణాలతో ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక బల్దియా కమిషనర్, పశుసంవర్థక శాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి ప్రతినెలా సమావేశమై కుక్కల సంతతి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇలాంటి సమీక్షలే కానరావడం లేదంటే అతిశయోక్తికాదు. గతంలో వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీలో నియంత్రణ పేరిట కుక్కలను చంపివేశారని జంతు ప్రేమికుల ఫిర్యాదులో అక్కడి కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో జిల్లాలోని బల్దియా అధికారులు దాన్ని సాకుగా చూపి వాటి జోలికి పోవడానికి జంకుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించటం లేదు.

చర్యలు తీసుకుంటున్నాం

కార్పొరేషన్ పరిధిలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. గత కౌన్సిల్ సమావేశంలో కుక్కలు, కోతుల నియంత్రణకు ఆమోదం లభించింది. త్వరలో కుక్కలను పట్టుకునే కార్యక్రమం ప్రారంభం కానుంది. జంతు సంరక్షణ చట్టాలకు విఘాతం కలగకుండా నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

– సుమన్‌రావు, రామగుండం కమిషనర్

అందుబాటులో మందులు

కుక్కకాటుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటుకు గురైతే జ్వరం, తలనొప్పి, హైడ్రోఫోబియా (నీటిని చూసి భయపడటం) వంటి లక్షణాలు కనిపిస్తాయి. కంఠ నరాలు బిగుసుకుపోయి దాహం వేస్తుంది. శరీరంలో నీటిశాతం తగ్గి డీహైడ్రేషన్‌కు గురై చనిపోయే ప్రమాదం ఉంటుంది. కాటుకు గురికాగానే స్థానిక ఆసుపత్రికి వెళ్లి టీకా తీసుకోవాలి.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

అభివృద్ధే లక్ష్యంగా పోరాటం

- కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి ఎంఎస్ రాజ్‌ఠాగూర్



మిర్చీలు కాలుస్తున్న ఎంఎస్.రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు పనిచేస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. కార్పొరేషన్ 37వ డివిజన్ తిలక్‌నగర్ ఏరియాలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. సర్వశక్తులు ఒడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజల నుంచి తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొందరు తమ అక్కసు వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు. ప్రజల కోసం తెచ్చిన పథకాలు నియోజకవర్గంలో ఎవరికీ అందకపోవడం దారుణమన్నారు. పాదయాత్రలో భాగంగా మిర్చి బండి వద్ద మిర్చీలు కాల్చారు. ఆయన వెంట నాయకులు బొంతల రాజేష్, మాదరబోయిన రవికుమార్, ముస్తఫా, మహంకాళీ స్వామి, గాధం విజయానంద్, చుక్కల శ్రీనివాస్, పాతిపెల్లి రవి, బొమ్మక రాజేశ్ పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించండి

రామగుండం: అంగన్‌వాడీలు హక్కుల కోసం ఉద్యమించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జ్యోతి సూచించారు. అంతర్గాంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు మాత్రమే పెంచిందని, కనీస వేతనం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న వారికి పింఛన్, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 1, 2, 3 తేదీల్లో జరిగే రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ సీనియర్ నాయకుడు అడారి నర్సింగరావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సుల్తానాబాద్ రూరల్: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మనోహరెడ్డి

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కందునూరిపల్లె పంచాయతీ భవనం నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాలు పరిశుభ్రంగా మారాయని, పచ్చదనంతో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. సర్పంచ్ పన్నాల స్వరూప, ఎంపీపీ బాలాజీరావు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీటీసీ సంపత్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్ ఉన్నారు.

అందరికీ వైద్యమందేలా పల్లె దవాఖానాలు

ఓదెల: అందరికీ వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే దాసరి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లె, కనగర్తిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన, కనగర్తిలో పల్లెదవాఖానా, పాల కేంద్రాన్ని ప్రారంభించారు. మండలానికి ఎనిమిది పల్లె దవాఖానాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పులుగు తిరుపతిరెడ్డి, కొట దామోదర్‌రెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకాదేవి, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన, పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ కావటి రాజు, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

గోపయ్యపల్లిలో సంత్‌సేవాలాల్ జయంతి

పెద్దపల్లి మండలం గోపయ్యపల్లిలో నిర్వహించిన సంత్‌సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్, సీడీపీవో కవిత, ఎంపీఓ సుదర్శన్, అప్పన్నపేట విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డి, సర్పంచ్ దాతు మంజుల, నాయకులు పాల్గొన్నారు. లంబాడీల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు ఈఎస్ఐసీ బీఎంతో 'సాక్షి ఫోన్ ఇన్'

జ్యోతినగర్: కార్మికులకు ఈఎస్ఐసీ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) అందిస్తున్న సేవలు, సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలను ఈఎస్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఖగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తోంది 'సాక్షి'. ఆయనతో గురువారం 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలోని కార్మికులు తమకు ఈఎస్ఐసీ కల్పిస్తున్న సేవలు, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు తెలుసుకోవచ్చు.



ఖగేశ్వరరావు

తేదీ:	సమయం:	సెల్ నంబర్:
23-02-2023	ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు	94949 85525



జాజిరి ఆట షురూ..

'జాజిరి జాజిరి జాజిరి జాజా..' అంటూ గ్రామాల్లో హోళీ సంబరాలు అప్పుడే సంబరాలు మొదలయ్యాయి. కాముని పౌర్ణిమకు ముందు పన్నెండు రోజుల పాటు కోలలతో చిన్నారులు.. చప్పట్లతో మహిళలు ఆడుకోవడం ఆనవాయితీ. ఇంటింటికీ వెళ్లి బియ్యం, ధాన్యం, డబ్బులు పోగు చేసుకుంటారు. కాల్వశ్రీరాంపూర్‌లో చిన్నారులు ఇలా జాజిరి ఆడుతూ కనిపించారు. - కాల్వశ్రీరాంపూర్

హామీలే తప్ప.. అభివృద్ధి ఎక్కడ..?

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు
- రెండో విడత పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర చేస్తున్న విజయరమణారావు



పాదయాత్రలో భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప.. అభివృద్ధి ఎక్కడ చేసిందో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రశ్నించారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా 'గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ – పల్లెపల్లెకూ విజ్ఞన్న' నినాదతో మండలంలో రెండోవిడత పాదయాత్రను బుధవారం ప్రారంభించారు. ముందుగా ఐతరాజుపల్లిలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో, భూపతిపూర్, నర్సయ్యపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం దళితబంధు, రైతుబంధు, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వస్తే గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని భావిస్తే ఇప్పటికీ రోడ్లు, డ్రైనేజీలు లేవని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేకు ఇసుక మాఫియా మీద ఉన్న సోయి అభివృద్ధిపై లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే రైతులకు ఒకే దఫాలో రూ.రెండులక్షల రుణమాఫీ, పేదలకు ఇళ్లు కటిస్తామన్నారు. పాదయాత్రకు కాంగ్రెస్ నాయకులు, మహిళలు భారీగా తరలివచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు అంతటి అన్నయ్య, ప్రకాశ్‌రావు, సారయ్యగౌడ్, సత్యనారాయణ, రాంమూర్తి, అబ్బయ్యగౌడ్, చిలుక సతీశ్, దామోదర్‌రావు, శ్రీనివాస్, జమున, తిరుపతి, రాజిరెడ్డి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే గోస పడతాం



సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

గోదావరిఖని: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఐదేళ్లు గోసపడతామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ తెలిపారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం మార్కండేయకాలనీలో మాట్లాడారు. సమస్యలు చెప్పుకుందామంటే సీఎం కేసీఆర్ ఫాంహౌస్ దాటడం లేదని, పోలీసులతో అరెస్ట్ చేయిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రాంనాథ్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ పి.మల్లికార్జున్, నాయకులు ఆరుముల్ల పోచం, సోమారపు లావణ్య, బల్మూరి అమరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి

పాలకుర్తి: ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతోందని వివేక్ న్నారు. మండలంలోని కన్నాల, జీడీనగర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నాయకులు తొగరి తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కంకటి శ్రీనివాస్, పీసర్ల లక్ష్మణ్‌రావు, మడిపల్లి సంజీవ్, బుర్ర సదిగౌడ్, గండికోట బొబ్బిలిరాజ్, మల్క సురేందర్, బొడ్డుపల్లి లక్ష్మణ్, బండి రవి, కొమిరె లక్ష్మణ్, పల్లపు వెంకటేశ్, సూర అశోక్, కన్నం సాగర్, రాకేష్, భరత్ పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛ భారత్ సమావేశం

ఎలిగేడు: స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్–2లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిశాయి. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ చేయడం, ఐఈసీ ప్రచార కార్యక్రమాలను గ్రామ పంచాయతీ లెవల్‌లో చేయడం, పరిశుభ్రత విషయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎస్‌బీఎంలు రాఘవులు, రేణుక, ఏపీవో సదానందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, టీ సెర్ప్ ఏపీఎం సుధాకర్, సర్పంచులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి


హెచ్‌ఆర్‌ డైరెక్టర్‌ దిలీప్‌కుమార్‌తో బాబర్‌ సలీంపాషా

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్‌ సమస్యలు పరిష్కరించాలని ఎన్టీపీసీ డైరెక్టర్‌(హెచ్‌ఆర్‌) దిలీప్‌కుమార్‌ పటేల్‌కు ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి, ఎన్టీపీసీ అడిషనల్‌ ఎన్సీసీ సభ్యులు బాబర్‌ సలీంపాషా విన్నవించారు. బుధవారం న్యూఢిల్లీలోని ఎన్టీపీసీ కార్పొరేట్‌ కార్యాలయంలో హెచ్‌ఆర్‌ డైరెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. కొత్త వేతన ఒప్పందం అమలుపై చర్చించామని, ప్రాజెక్టులో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరామని పాషా వెల్లడించారు. ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్యలపై ఎన్సీసీ, ఎన్‌జేసీసీ సమావేశం నిర్వహించాలని కోరగా.. నెల రోజుల్లో ఏర్పాటుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

బలపడుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ

రామగుండం: పెట్టుబడిదారీ వ్యవస్థ క్రమంగా బలపడుతోందని, ఈ క్రమంలో వస్తున్న మార్పులను కమ్యూనిస్టులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా జిల్లా నాయకుడు కట్ట తేజేశ్వర్‌ అన్నారు. కమ్యూనిస్టు వందేళ్ల సంబురాల్లో భాగంగా బుధవారం అంతర్గాం మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. వందేళ్లలో సాయుధ పోరాటం ద్వారా కమ్యూనిస్టులు త్యాగపూరిత పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు కోడిపుంజుల లక్ష్మి, కల్పన, ఎల్లయ్య, ఆడెపు శంకర్‌, భూషణవేణి కృష్ణ, ప్రసన్నకుమార్‌, తీగుట్ల రాములు, నస్పూరి లక్ష్మి, ఆలకుంట ఎల్లయ్య , ఇనుగాల రాజేశ్వర్‌, వాసుదేవరెడ్డి, మెతుకు వెంకటేశం, సారయ్య, రాజేందర్‌ తదితరులున్నారు.

25న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్‌: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఈనెల 25న ప్రైవేట్‌ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 30 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. పదో తరగతి పాసై.. 18 నుంచి 35ఏళ్ల వారు జిల్లాలోని ఎల్‌ఐసీ కింద ఆర్‌సీఏగా పనిచేయాల్సి ఉంటుందని, ఆసక్తి గలవారు ఈనెల 25న ఐటీఐ ఆవరణలో జరిగే ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 8639 44807, 89853 36947, 95026 42441 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బైండోవర్‌ ఉల్లంఘించిన వ్యక్తికి ఏడాది జైలు

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండా (బి) గ్రామానికి చెందిన భూక్య గంగ్యానాయక్‌ బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఏడాది జైలు శిక్ష విధించిందని పెద్దపల్లి ఎక్సైజ్‌ సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. గంగ్యానాయక్‌ గతంలో గుడుంబా తయారీ, విక్రయిస్తూ.. పట్టుబడడంతో తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేశారు. అయినప్పటికీ ఆయన వ్యాపారం కొనసాగించడంతో గత జనవరి 22న సీఓఆర్‌ నంబర్‌ 05/2023 ద్వారా కేసు నమోదు చేసి తహసీల్దార్‌ శ్రీనివాస్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు సీఐ తెలిపారు. ఉల్లంఘన నేరం కింద రూ.లక్ష చెల్లించాలని నోటీసు జారీ చేశారు. ఆ సొమ్ము చెల్లించనందున అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు సీఐ తెలిపారు.

సాంస్కృతిక కొలువులకు ఉద్యమ కళాకారుల నిరీక్షణ

- ఇంటర్వ్యూలు పూర్తయి మూడేళ్లు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న కళాకారులు


ఉద్యమ కళాబృందంలో పాల్గొన్న వీరాలాల్‌ (ఫైల్‌)

జ్యోతినగర్‌: తెలంగాణ రాష్ట్ర సాధనలో మేము సైతం అంటూ కాళ్లకు గజ్జె కట్టి, డప్పులు వాయించి ఉద్యమంలో పాల్గొని ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన కళాకారులు నేడు తెలంగాణ సాంస్కృతిక సారథిలో కొలువులు వస్తాయని ఎదురుచూస్తున్నారు. విద్యార్థి దశలోనే ఒకవైపు స్కూలుకు వెళ్తూనే మరోవైపు ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా.. నెత్తిన బోనం, దీపాలతో ఉత్సాహంగా ఉద్యమంలో పాల్గొన్నారు. అలాంటి కళాకారులు నేడు కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ములుగు జిల్లా బరిగెలపల్లెకు చెందిన లావుడియా నిరోష జీవనోపాధి కోసం రామగుండం కార్పొరేషన్‌ రెండో డివిజన్‌ న్యూపీకేరామయ్య కాలనీలో భర్త, ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. ఆనాడు కేసీఆర్‌, ఆలే నరేంద్రతో ఔరా.. అనిపించుకుని ఉద్యమంలో భాగంగా నిర్వహించిన తెలంగాణ ధూంధాంలో నిజాం కళాశాల మైదానం, కాకతీయ యూనివర్సిటీ, న్యూఢిల్లీలో జరిగిన బతుకమ్మ సంబరాలు, ముంబయి, గోర్‌గావ్‌లో జరిగిన ధూంధాం, కరీంనగర్‌ ఉప ఎన్నికలలో కార్యక్రమాలతోపాటు అనేక ఉద్యమ వేదికలపై ఆడిపాడింది గిరిజన కళాకారిణి లావుడియా నిరోష. రామగుండం కార్పొరేషన్‌ 23వ డివిజన్‌కు చెందిన లావుడియా వీరాలాల్‌ సైతం ఉద్యమ నాయకుడు. ప్రస్తుతం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నాడు. తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించి ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించాడు. వీరు తెలంగాణ సాంస్కృతిక సారథిలో కళాకారుల కొలువు కోసం 2019లో ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మూడేళ్లుగా కొలువు కోసం ఎదురుచూస్తున్నారు. నియామకపు జాబితా విడుదల చేస్తే వీరితోపాటు పలువురికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



రాష్ట్ర సాధనలో పాల్గొని అనేక నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. 2019లో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ సాంస్కృతిక సారథి నియామక ఇంటర్వ్యూకు హాజరయ్యాను. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కళాకారిణిగా గుర్తించి ఉపాధి చూపించాలి.
– లావుడియా నిరోష

ఉపాధి కల్పించాలి



రాష్ట్ర ఉద్యమంలో ప్రతిరోజూ పాల్గొని కళా ప్రదర్శనలు ఇచ్చాను. తెలంగాణ సాంస్కృతిక సారథి నియామకాలకు జరిగిన ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. డిసెంబర్‌ 2019లో జరిగిన ఇంటర్వ్యూల నియామకం జాబితా విడుదల కోసం ఎదురుచూస్తున్నాను. – లావుడ్య వీరాలాల్‌, సుభాష్‌నగర్‌

బొగ్గుబాయి వార్తలు

మారు పేర్ల మార్పు అమలయ్యేదెప్పుడో..?

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: మారుపేర్ల మార్పు పూర్తయ్యేది ఎప్పుడని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యంతో గుర్తింపు సంఘం, ఐదు జాతీయ సంఘాలు అగ్రిమెంట్‌ చేసుకున్న ప్రకారం కార్మికుల మారు పేర్ల మార్పుపై యాజమాన్యం ఇప్పటికి నిర్ణయం తీసుకోలేదన్నారు. మైనింగ్‌, టెక్నికల్‌, ఆపరేటర్స్‌, సిబ్బంది మెడికల్‌ అన్‌ఫిట్‌ అయితే సూటబుల్‌ జాబ్‌ ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నా.. అమలు చేయడం లేదన్నారు. మారుపేర్ల మార్పు లేకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభలు గోదావరిఖనిలో మార్చి 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గేట్‌ మీటింగ్‌లో నాయకులు కారం సత్తయ్య, ఆరేపల్లి రాజమౌళి, గౌస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్‌లో ప్లేడే పునరుద్ధరించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఏరియా వర్క్‌షాప్‌లో ప్లేడేలను పునరుద్ధరించాలని ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులు ఆందోళన చేపట్టారు. కరోనా సమయంలో ఎత్తివేసిన ప్లేడేలను తిరిగి ఇవ్వాలన్నారు. అనంతరం ఏరియా వర్క్‌షాప్‌ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, ఐఎన్టీయూసీ డిప్యూటీ జనరల్‌ సెక్రటరీ దేవులపల్లి రాజేందర్‌, ఏఐటీయూసీ పిట్‌ సెక్రెటరీ బలుసు రవి, హెచ్‌ఎంఎస్‌ రీజియన్‌ కార్యదర్శి బండారి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ ట్యాంకులు ప్రారంభం

గోదావరిఖని: మూడు లక్షల గ్యాలన్ల వాటర్‌ స్టోరేజీ ట్యాంకులను ఆర్జీ–1 జీఎం కె.నారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1.5 కోట్లతో మూడు లక్షల గ్యాలన్ల వాటర్‌ నిలువ గల ట్యాంకులను నిర్మించినట్లు పేర్కొన్నారు. హై కెపాసిటీ గల మోటార్ల పంపింగ్‌ ద్వారా ఆర్జీ–2, ఆర్జీ–3 ఏరియాల నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందన్నారు. తక్కువ కాలంలో పనులను పూర్తి చేసిన టీమ్‌ సభ్యులను అభినందించారు. సీఎంఓఏఐ అధ్యక్షుడు శ్రీనివాస్‌, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్‌, ఫైనాన్స్‌ ఏజీఎం రామక్రిష్ణ, సివిల్‌ డీజీఎం నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు కలవేన శంకర్‌

గోదావరిఖనిటౌన్‌: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు కలవేన శంకర్‌ అన్నారు. 'విద్యార్థుల భవిష్యత్తు–విద్యాభివృద్ధి' సదస్సును స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌ మాట్లాడారు. గోదావరిఖని పేరు రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిందని, ఇక్కడి ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలు చాలా ఉండేవని, వేలాది మంది విద్యార్థులతో కళకళలాడేదని, ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు గనులు, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌, జెన్‌కో వంటి పరిశ్రమలు ఉండి.. పారిశ్రామికంగా అభివృద్ధి చెందినప్పటికీ విద్యాభివృద్ధిలో మాత్రం వెనుకబడిపోయిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు అభివృద్ధి చెందితేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోషిక మోహన్‌, నగర కార్యదర్శి కే.కనకరాజ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మార్కపురి సూర్య, ప్రిన్సిపల్స్‌ సమ్మారావు, నాగండ్ల రవికుమార్‌, యు.రవీందర్‌, సునీత, ఏకాంతం, రఘుపతి, కృష్ణ, స్వామి, చాంద్‌, మౌళి, ఏఐఎస్‌ఎఫ్‌ రామగుండం కార్పొరేషన్‌ అ ధ్యక్షుడు ఎల్కలపల్లి సురేష్‌, సహాయ కార్యదర్శి మాతంగి సాగర్‌, కోశాధికారి గాజుల అవినాష్‌, ములుగూరి నితిలేశ్‌, శంకర్‌, ధనాల దినేష్‌ పాల్గొన్నారు.

బైక్‌ అదుపుతప్పి ఒకరి మృతి



సుల్తానాబాద్‌ రూరల్‌: మండలంలోని కనుకుల క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై ఉపేందర్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని రామునిపల్లికి చెందిన కొమ్ము రాజేశం (55) బైక్‌పై రామునిపల్లిలో ఓ శుభకార్యానికి వచ్చి మంచిర్యాల తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బైక్‌ అదుపుతప్పి కింద పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న నాయకులు

మంథని: సమస్యల పరిష్కారానికి నేతకాని సామాజిక వర్గం సంఘటితం కావాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్‌ తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో నేతకాని కులానికి చెందిన ఎనిమిది సంఘాలు ఏకమై నేతకాని మహార్‌ సంఘంగా రూపాంతరం చెందిందన్నారు. రాష్ట్ర పొలిట్‌ బ్యూరో కన్వీనర్‌ సెగ్గెం రాజేశ్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో 19 ఎస్సీ రిజర్వ్‌ అసెంబ్లీ స్థానాల్లో నేతకాని సమాజానికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఏప్రిల్‌, మే నెలల్లో హైదరాబాద్‌లో నేతకాని సింహగర్జన బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మాల, మాదిగల తర్వాత అత్యధికంగా ఉన్న నేతకాని కులానికి తగిన గుర్తింపు లేకపోవడం శోచనీయమని రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లి రాజమల్లు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్టీరింగ్‌ కమిటీ అధ్యక్షుడు దుర్గం నర్సయ్య, జిల్లా నాయకుడు నగేష్‌, మోతె నరేష్‌, సెగ్గెం సంతోష్‌, జాడి రాజయ్య, బండారి తిరుపతి, తదితరులు ఉన్నారు.

ఏటీఎం బ్యాటరీల దొంగలు అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్‌: పట్టణంలోని ఎస్‌బీఐ(శాస్త్రీనగర్‌) బ్రాంచ్‌ ఏటీఎంలో బ్యాటరీలను దొంగలించిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. ఈనెల 20న అర్ధరాత్రి ఏటీఎంలో బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. దీనిపై బ్రాంచ్‌ మేనేజర్‌ ఫిర్యాదు చేశారు. మండలంలోని కాట్నపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలిగేడు మండలం నర్సాపూర్‌కు చెందిన సుంక శ్యాం, అశోక్‌, కాట్నపల్లికి చెందిన గంగుల శ్రావణ్‌ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి విచారణ చేపట్టగా బ్యాటరీలను విక్రయించేందుకు వెళ్తున్నట్లు తేలింది. మొదటగా నాలుగు బ్యాటరీలను కరీంనగర్‌లోని ఓ స్క్రాప్‌ దుకాణంలో విక్రయించారని, మరో రెండు బ్యాటరీలను ఆటోలో కరీంనగర్‌ తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. సుంక శ్యాం ఓ బ్యాటరీ కంపెనీలో ఆన్‌లైన్‌ సర్వీస్‌ సేవలు నిర్వహించేవాడని, ఏటీఎంలలో, పెట్రోల్‌ పంపుల్లో అమర్చే అనుభవంతో సులభంగా దొంగిలించేందుకు మరో ఇద్దరి సహాయం తీసుకున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిందితులను పట్టుకో వడంలో చురుకుగా వ్యవహరించిన ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్‌ తిరుపతినాయక్‌ను అభినందించారు.

మూడునెలలు దాటినా అందని వేతనాలు

- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మల్టీపర్పస్‌ వర్కర్లు
- అప్పు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్న వైనం
- ప్రభుత్వం స్పందించి వేతనాలివ్వాలని విన్నపం


చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

సుల్తానాబాద్‌/కాల్వశ్రీరాంపూర్‌: పారిశుద్య కార్మికుల (మల్టీపర్పస్‌ వర్కర్లు)కు నాలుగు నెలలు కావస్తున్నా వేతనాలు మాత్రం విడుదల కాలేదు. దీంతో కుటుంబ పోషణకు అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు. సాధారణ పరిపాలన శాఖ 1990లో ఇచ్చిన ఉత్తర్వుల సంఖ్య 223 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించాలి. ప్రభుత్వం కూడా మొన్నటివరకు ఈ విధానాన్నే అమలు చేసింది. వచ్చిన వేతనంతో పిల్లల చదువులు, ఇల్లు, కారు, ఇతరత్రా అవసరాలు తీర్చుకునేవారు. కొన్ని నెలలుగా వేతనాలు సకాలంలో అందకపోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 266 గ్రామపంచాయతీల్లో సుమారు 1200 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కారోబార్లు, ట్రాక్టర్‌ డ్రైవర్లు, ఆపరేటర్లు, వాటర్‌ సప్లై కార్మికులు, పారిశుధ్య కార్మికులు ప్రతినెలా వేతనం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. వేతనాల చెల్లింపులో రెండేళ్లుగా జాప్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీపీఓ చంద్రమౌళిని వివరణ కోరగా జీతాలు అందరికీ అందేలా చూస్తామన్నారు.

మూడు నెలలు దాటింది



మాకు వేతనం వచ్చి 3నెలల 22 రోజులవుతోంది. ఇప్పటివరకు వేతనాలు జమ కాలేదు. పంచాయతీ అధికారులను అడిగితే అకౌంట్లో జమ చేశాం.. జమ కాకపోవడం మాకు తెలువదని చెప్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని మల్టీపర్పస్‌ వర్కర్లకు జీతాలు అందించాలి.
– వెంకన్న, కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

అప్పు చేస్తున్నాం..



జీతం రాకపోవడంతో అప్పు చేయాల్సి వస్తోంది. కుటుంబసభ్యులను ఆకలితో ఉంచలేం కదా. జీతం వచ్చిన తర్వాత తీర్చుతానని చెప్పి అప్పు తెస్తున్నా. అధికారులు చొరవ తీసుకొని జీతాలు వచ్చేలా చూడాలి.
– సుశీల, కార్మికురాలు, కాల్వ శ్రీరాంపూర్‌

రైతు సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించాలి


మాట్లాడుతున్న కిరణ్‌ కుమార్‌

రామగిరి(మంథని): రైతులు పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని, వాటికి పరిష్కారాలు సూచించాలని కొండా లక్ష్మణ్‌ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం సంచాలకులు కిరణ్‌ కుమార్‌ సూచించారు. స్థానిక కేవీకే బుధవారం 11వ శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో మాట్లాడారు. పాడి పశువుల కోసం గ్రామాల్లో సదస్సులు చేపట్టాలని, నాణ్యమైన కూరగాయల విత్తనాలను రైతులకు సకాలంలో అందించాలని, వాటిపై పరిశోధనలు చేయాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తల బృందం ఏడాదిపాటు వివిధ గ్రామాల్లో చేపట్టిన సాంకేతిక కార్యక్రమాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు. దత్తత గ్రామాలు, రైతుల లబ్ధిని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు ఏఆర్‌.రెడ్డి, అరుణ్‌ కుమార్‌, శ్రీనివాస్‌, రవీందర్‌ రెడ్డి, జగన్మోహన్‌ రెడ్డి సలహాలు సూచనలు అందించారు. ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావు, కేవీకే శాస్త్రవేత్తలు వెంకన్న, భాస్కరరావు, టి.వినోద్‌కుమార్‌, కిరణ్‌ పిల్లి, బి.నవ్య, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన గంగి పెల్లి శివాణి (23) ఉద్యోగం రాలేదన్న బెంగతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎల్లయ్యగౌడ్‌ వివరాల మేరకు.. ఎంబీఏ విద్యనభ్యసించిన శివాణి ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా హైదరాబాద్‌లో కోచింగ్‌ తీసుకుంటూ విఫలయత్నం కాగా ఆవేదనకు లోనై బద్దిపల్లికి వచ్చింది. ఉద్యోగం రా లేదన్న బెంగతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉ రేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ సీజ్‌

సారంగాపూర్‌(జగిత్యాల): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం అటవీశాఖ అధికారులు సీజ్‌ చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పోతారం, బట్టపల్లి గ్రామ శివారుల నుంచి ఇటుక తయారీ కోసం టిప్పర్‌లో మట్టిని తరలిస్తుండగా అటవీశాఖ జగిత్యాల రేంజర్‌ ప్రణీత్‌కౌర్‌, సెక్షన్‌ అధికారి మహేష్‌ టిప్పర్‌ను సీజ్‌చేసి కల్లెడ ఫారెస్ట్‌ డిపోకు తరలించారు. పోతారం శివారు గ్రామం గణేష్‌పల్లికి చెందిన ఇడగొట్టు సాయికృష్ణ, గొల్లపల్లికి చెందిన తపల్ల శ్రీహరిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అటవీశాఖ అధికారుల వెంట బీట్‌ అధికారులు గోపాల్‌, రవీందర్‌ ఉన్నారు.



మట్టిలో మగ్గుతున్న బాల్యం..

పెన్ను, పుస్తకం పట్టాల్సిన చిన్నారులు ఇటుక బట్టీల్లో మగ్గిపోతున్నారు. మట్టి పనులు చేస్తూ.. తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నారు. చదువుకోవాలని ఉన్నా.. చెప్పించేవారు లేక ఇలా కాలం వెళ్లదీస్తున్నారు వలస కూలీల పిల్లలు. చిన్నారులతో పనులు చేయిస్తే యజమానులపై చర్యలు తప్పవని లేబర్‌ అధికారులు, పోలీసులు హెచ్చరించినా మార్పు రావడం లేదంటున్నారు ఈ చిన్నారులను చూసిన వారు. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, పెద్దపల్లి